ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## మురమళ్ళలో శ్రీనాన్నగారి ప్రవచనము, 14-11-95

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉపనిషత్‌లు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలు వీటిని ప్రస్థానత్రయం అంటారు. ఇందులో భగవద్గీత ఉపదేశగ్రంధము. గీతలో నరుడికివచ్చిన సందేహాలను నారాయణుడు తీర్చాడు. మన సందేహాలను భగవంతుడు కాకపోతే ఎవరుతీర్చగలరు. సామాన్య మానవునుకి వచ్చే సందేహాలు అర్జునుడు ప్రశ్నించటం దానికి భగవంతుడు వాసుదేవస్వామి సమాధానాలు వివరంగా చెప్పారు. ఎప్పుడైనా భగవద్గీత చదువుకోమంటారా అని భగవాన్‌ను ఒక భక్తుడు అడిగాడు. ఎప్పుడైనా చదువుకోవటం కాదు ఎప్పూడూచదువుకో అని భగవాన్ చెప్పారు.

భగవద్గీతలో ఉన్న సందేశమును మననం చేసుకోవటంవలన మనసందేహాలు నివృత్తి అవ్వటమే కాకుండా మనం పవిత్రులమవుతాము. పూజచేసినా, జపంచేసినా, శ్రవణంచేసినా పవిత్రం అవ్వటానికే. ఏమతస్థుడైనాసరే పవిత్రత అనే గేటు ద్వారానే మోక్షము లోనికి వెళ్ళాలి ఎవడికైనాసరే పవిత్రతలేకుండా వస్తువు అనుభవంలోనికి రాదు. ఎందుచేతనంటే ఆవస్తువు పవిత్రమైనది. పరమపవిత్రుడికే ఆవస్తువు వ్యక్తమవుతుంది.

భగవంతుడు గీతలో నాలుగురకాల భక్తులుగురించి చెప్పాడు. 1.ఆర్తుడు 2. అర్థార్ధి 3. జిజ్ఞాసువు 4. జ్ఞాని. ఏదైనాకష్టం వచ్చినపుడు, దుఖఃము వచ్చినపుడు దేవుని తలచుకొంటాడు. దేవుని దయవలన ఆ కష్టము పోయింది అనుకోండి మరల దేవుని మర్చిపోతాడు. వాడిని ఆర్తుడు అంటారు. అర్థార్ధి అంటే వాడికి కోరికలు ఉంటాయి. కోరికలను నెరవేర్చుకోవటం కోసం దేవుని ప్రార్ధిస్తాడు. ఆ కోరికలు నెరవేరిన తరువాత దేవుని మర్చిపోతాడు. ద్వైతం ఉన్నప్పుడు కోరిక ఉదయిస్తుంది. ఆకోరికను నెరవేర్చమని భగవంతుని ప్రార్ధిస్తున్నాము. ఎందుచేతనంటే మన తెలివితేటలవలన, మనశక్తివలన కోరికలను నెరవేర్చుకోలేము. భగవంతుని సహాయంకావాలి కాబట్టి భగవంతుని అనుగ్రహం లేకుండా కోరిక నెరవేరదు అని గుర్తించినపుడు భగవంతుని ప్రార్ధిస్తాము. మనవలన అయిపోతే దేవుని ప్రార్ధించము. మనవల్లకాదు ఇదిదైవసహాయం ఉంటేగాని నెరవేరదు అనుకొన్నప్పుడు దేవుని ప్రార్ధిస్తాము. అప్పుడు నెరవేరవచ్చును కూడా. మానవప్రయత్నం ఒక్కటే సరిపోదు. దేవుని అనుగ్రహం అవసరము. ఈశ్వరుని ప్రార్ధించటములో పొరపాటు ఏమీలేదు. కోరిక నెరవేరిన తరువాత దేవుని మర్చిపోతాము.

జ్ఞానసముపార్జనకు ప్రయత్నించేవాడు జిజ్ఞాసువు. తత్వంగ్రహించటానికి సాధనచేస్తాడు. లోకపరంగా పెద్ద విషయాలు ఏమీవాడికిఉండవు. సద్వస్తువును అందుకోవటానికి ప్రయత్నం చేస్తూఉంటాడు. వాడు జిజ్ఞాసువు. జిజ్ఞాసువు ఏతత్వమును తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడో, ఏ సద్వస్తువును అందుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాడో అదివాడి చేతికి అందిన తరువాత, అదివాడికి అనుభవంలోనికి వచ్చిన తురువాత వాడిని జ్ఞాని అంటారు. జ్ఞాని కూడా భక్తుడే. భగవంతుని విడిచిపెట్టి వేరుగా ఒక్కక్షణంకూడా వాడు ఉండడు. అందువలన జ్ఞాని కూడా భక్తుడే అని చెప్పారు. మనం ఒకటో తరగతిలో ప్రారంభించినా అందులోనే ఉండకూడదు. పెద్దపెద్దక్లాసులకు వెళ్ళాలి. మనం ఆర్తితో ప్రారంభించినా జ్ఞాన స్థితికి వెళ్ళాలి.

జ్ఞానమువస్తుందా, రాదా అనే సందేహము వద్దు. జ్ఞానము మనస్వరూపమే. ఆనందముమన స్వరూపమే. అది అందకుండా మనమనస్సే అడ్డువస్తోంది. మనం మనస్సుకు ఇవ్వకూడని ప్రాముఖ్యతను ఇస్తున్నాము. దేహమునకు, మనస్సుకు ఇవ్వకూడని ప్రాముఖ్యత ఇస్తున్నందువలననే మనకు అభిమానబుద్ధి పెరుగుతోంది. ఎవరైనాచిన్నమాట అంటే అభిమానం వచ్చేస్తుంది. దీనికి కారణము దేహమునకు, మనస్సుకు ప్రాముఖ్యత ఇవ్వటమే. బాహ్యంగా సుఖంలేదు, ఆనందములేదు. సుఖం నీహృదయంలోనే ఉంది. నీస్వరూపము నీకువ్యక్తమయినపుడు నీ హృదయంలో ఉన్నసుఖమునీకు అందుతుంది. అది అవ్యయ, అభవ, పూర్ణ, చిత్ సుఖము. అది ఎంత అనుభవించినా తరగదు. అప్పుడు దేహం ఉందోలేదో నీకే తెలియదు. భాగవతంలో ఒకమాట ఉంది బాగా సారా త్రాగినవాడికి ఒంటిమీద బట్టఉందోలేదో వాడికి తెలియదు అలాగే ఆత్మసుఖం అనుభవించే వాడికి దేహం ఉందోలేదో తెలియదు. అట్టిది ఆత్మసుఖము. అదినీహృదయంలోనే ఉంది. దానిని తెలుసుకోవటానికి నీకు లోచూపుకావాలి.

మనకు శవదృష్టి ఎక్కువ, శివదృష్టి తక్కువ. శివదృష్టివలన మనకు లోదృష్టి కలుగుతుంది. లోదృష్టి కలగాలంటే నామ, రూపదృష్టి తగ్గాలి. ప్రపంచములో ఏవస్తువును చూసినా నామదృష్టి తోటి, రూపదృష్టి తోటి చూస్తాము. ఇలా చూస్తున్నంత కాలము మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. బాహ్యముఖంగా విజృంభిస్తున్న మనస్సును వెనుకకు మరలించటమే గురువు చేసేపని. ఎప్పుడైతే నామ, రూపదృష్టి తగ్గిపోయిందో మనస్సు దానంతట అదే హృదయంలోనికి వెళ్ళిపోతుంది.

నేను అనే మొదటి తలంపు ఎక్కడయితే ఉదయిస్తోందో అదే హృదయము. దానినే ఆధ్యాత్మిక హృదయం అంటారు. ఆధ్యాత్మిక హృదయంలో నీ పూర్వజన్మ గొడవలు, వాసనలు, సంస్కారములు, రాబోయేజన్మకు హేతువులు అన్నీ ఉంటాయి. లోభివాడు తన ధనమును ఎంత జాగ్రత్తగా చూసుకొంటాడో అంత జాగ్రత్తగా నీవు చేసిన పనులను, నీకు వచ్చిన తలంపులను నీహృదయం జాగ్రత్తపెట్టి ఉంచుతుంది. మనం మంచిచేసినా, చెడ్డ చేసినా ఏదో ఒకరోజు సమాధానం చెప్పితీరాలి.

ఈ సృష్టిలో అన్నింటికంటే ఉత్తమమైనది, ఉదాత్తమైనది, పరమపవిత్రమైనది జ్ఞానము. జ్ఞానం అంటే రమణమహర్షిగారు లోకజ్ఞానం గురించి, శాస్త్రజ్ఞానము గురించి చెప్పలేదు. ప్రపంచము అంతా ఒక తత్వం వ్యాపించి ఉంది. ఈసృష్టి అంతా వ్యాపించి ఉన్న తత్వమే నీహృదయంలోనూ ఉంది. ఇప్పుడు నీకు మనస్సునేనుగా ఎలా వ్యక్తమవుతుందో అలాగే నీహృదయంలో ఉన్నతత్వము నేనుగా వ్యక్తమయితే అదే జ్ఞానము. అది మిధ్యాజ్ఞానము కాదు. అది ఆత్మజ్ఞానము.

ఆత్మలబ్ధికి గురువు అవసరమా అని అడిగారు. శరీరము చనిపోయినపుడు బంధువులతోటి, పరిసరాలతోటి, స్నేహితులతోటి ఉన్నసంబంధము తెగిపోతుంది. కాని గురువుతో ఉన్న సంబంధము తెగదు. శిష్యుడు మర్చిపోయినా గురువు మర్చిపోడు. గురువు అంటే ఆత్మ. వాడు మనహృదయంలోనే ఉన్నాడు. నీవు ఎక్కడ పుట్టినా వాడుచూసుకొంటూ ఉంటాడు. వాడు గురువు. పులినోట్లో పడ్డ మాంసపు ముక్కను బయటకు లాగవచ్చునేమోగాని గురువు అనుగ్రహంలోపడ్డవాడు రక్షింపబడతాడుగాని అక్కడనుండి escape అవ్వటానికి ఆస్కారము లేదు అన్నారు రమణాచార్యులు.

జిడ్డు కృష్ణమూర్తిగారు గురువు అవసరం లేకుండా జ్ఞానమును సంపాదించవచ్చు అని చెపుతున్నారు. దాని గురించి మీ అభిప్రాయం ఏమిటి అని భగవాన్‌ను అడిగారు. ఆయనకు గురువు అవసరం లేకపోవచ్చునేమోగాని అందరికీ గురువు అవసరములేదు అని ఆయనకు ఎలాతెలుసు అన్నారు భగవాన్.

ఆయన ఏమి సమాధానం చెప్పినా సహేతుకంగా, సమగ్రంగా, సరళంగా ఉంటుంది. బ్రహ్మానుభవం కలగటానికి అత్యంతప్రధానమైనది గురువు అనుగ్రహం మాత్రమే. ఈబోధలు, ధ్యానాలు, శ్రవణాలు ఇవి అన్నీ రెండవపక్షము.

సాధన పేరుమీద ఎక్కువ కష్టపడవలసిన పనిలేదు. ఈచిట్కాలు నేర్చుకోండి. ఎదుటి మనిషిని గౌరవముగా చూడటంవలన మనకు అహంభావన తగ్గుతుంది. అగౌరవముగా చూస్తే అహంభావన పెరుగుతుంది. కొంతమంది హేళనగా మాట్లాడతారు. అది ఒక అలవాటు. హేళనగా మాట్లాడటంవలన వారికి తెలియకుండానే అహంభావన పెరిగిపోతుంది. మీరు నెమ్మదిగా మాట్లాడుతూఉంటే, వారి శ్రేయస్సు కోరి మాట్లాడుతూఉంటే . వారికి చైతన్యస్థాయి పెరగాలి అనే సహృదయంతో మాట్లాడుతూ ఉంటే మీకు తెలియకుండానే మీ అహంభావన తగ్గుతుంది.

(అహంకారమును పోగొట్టుకోమని చెపుతున్నారు. మీరు మాట తేలికగానే చెపుతున్నారు. దానిని పోగొట్టుకోవటం అంత తేలికకాదు అని ఒక భక్తుడు అంటున్నాడు. అన్ని చిక్కులు, సమస్యలు, పేచీలు అహంకారము వలననే వస్తున్నాయి. వీటి అన్నింటికి అహంకారమే కారణము. అహంకారములో ఉన్నకారమును తీసివెయ్యండి అని భగవాన్ చెపుతున్నారు.)

(నీవు ఆత్మను వెతకటం కష్టం అంటున్నావు. ఆత్మను వెతికేవాడు ఒకడు నీలోపల ఉన్నాడు కదా. వాడు ఎవడో కనుక్కో అంటున్నారు. మీరు అందరూ చనిపోయిన తరువాత వైకుంఠమునకో, కైలాసమునకో వెళదామని పూజలు చేస్తున్నారు, జపాలు చేస్తున్నారు. అదీమన ఉద్దేశము. వైకుంఠమునకు వెళ్ళే ఈ నేను ఎవరు? కైలాసమునకు వెళ్ళే ఈ నేను ఎవరు? అని వీడిని బోనులోపెట్టి విచారణ చేయమంటున్నారు. అదే జ్ఞానమార్గము అంటున్నారు రమణాచార్యులు.) who am I?

ప్రాణశక్తిని సద్వినియోగం చేసుకోవాలి. అనవసరమైనమాటలు మాట్లాడకూడదు. మనకు ఆధ్యాత్మికంగా ఉపయోగపడే పనులే చేయాలి. ఆధ్యాత్మికంగా ఉపయోగపడేమాటలే మాట్లాడాలి. ఏవిధంగా పని చేస్తే, ఏవిధంగా మాట్లాడితే మనచైతన్యస్థాయి పెరుగుతుందో ఆవిధంగా మాట్లాడాలి, ఆవిధంగా పనిచెయ్యాలి. జ్ఞానులు చెప్పిన మాటలు వినండి. బ్రహ్మానుభవం పొందినవాడు బ్రహ్మం గురించే చెపుతాడు కాబట్టి వాడు చెప్పినమాటలు వినండి. అటువంటివాడు నీకు కనబడకపోతే వేదం చెప్పిన మాటలు, గీతలో చెప్పిన మాటలు శ్రద్ధగావిని, అర్థంచేసుకొని, అనుభవంలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఏదైనా మనం అధ్యయనం చేస్తున్నప్పుడు దానిని అర్థం చేసుకోవటం కూడా ఒక యోగముతో సమానము.

ఎవడి సమక్షంలో కూర్చున్నపుడు నీప్రయత్నం లేకుండా నీమనస్సు యొక్క చాపల్యం, ఆగిపోయిందో, నీమనస్సు శాంతిగా ఉంటుందో అక్కడ నీకంటే ఎక్కువ చైతన్యస్థాయి ఉండి ఉండాలి. లేకపోతే నీ మనస్సుయొక్క చాపల్యం ఆగదు. అక్కడ ఎంతో కొంత చైతన్యస్థాయి ఉంది అనిగ్రహించండి అంటున్నారు రమణాచార్యులు.

జ్ఞానియొక్క భోద మౌనంలో ఉండవచ్చును, ఉపన్యాసరూపములో ఉండవచ్చును, సంవాదము రూపములో ఉండవచ్చును. ఏ రూపములో అయినా ఉండవచ్చును. ఇవి అన్నీ రెండవపక్షము. అత్యంత ప్రధానమైనది గురువు అనుగ్రహము మాత్రమే. గురువు అంటే ఆత్మ. ఆత్మ అనుగ్రహం లేకుండా లేదు. ఆత్మ అనుగ్రహ స్వరూపము. అగ్ని వేడి లేకుండా ఎలా అయితే ఉండదో అలాగే ఆత్మ అనుగ్రహం లేకుండా ఉండదు ఎందుచేతనంటే దానిస్వరూపమే అనుగ్రహము.

నాకు దేహబుద్ధి ఉన్నంతకాలము ఆత్మను నేను దర్శించలేను. ఆత్మానుభవం నాకు కలుగదు. నాకు దేహబుద్ధి ఉన్నంతకాలము ఇతరులను కూడా దేహమే అనుకొంటాను. ఆత్మ అనుకోను. నాదేహబుద్ధిని తొలగించటం కోసం లోపల ఉన్నఆత్మే దేహము ధరించి వస్తుంది. వాడే గురువు. ఏ బలహీనతవలన, ఏ అలవాటువలన మనమనస్సు బయటకు విజృంభిస్తుందో చూసి ఆ అలవాటు నుండి మనలను తప్పించి మనలను లోపలకు తోలుకొని వెళతాడు. నిజమైన గురువు మనలోపలే ఉన్నాడుకదా మన జుట్టుపట్టుకొని వెళ్ళి వాడికి అందిస్తాడు. వాడు మనజీవలక్షణములను తీసివేసి వాడి స్వరూపమును ఇస్తాడు. అదికడసారి జన్మ.

సాధనచేస్తున్నాము. ఆత్మలాభము ఎప్పుడు వస్తుంది అని అడిగితే చేసేపని మీద నీ మనస్సును పెట్టు. మినహాయింపులు లేకుండా చేసే పనిమీద నీ మనస్సును పెట్టు. ఫలితంకోసం ఎదురుచూడవద్దు. ఫలితం ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. అది నీచేతులలో లేదు. ఈశ్వరుని చేతులలో ఉంది. ఎప్పుడు ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో ఆయనకు తెలుసు. కంగారుపడవద్దు. ఆయనకు జ్ఞాపకం చేయవలసిన పనిలేదు. నీవు చేసేపని ప్రేమతో చెయ్యి, ప్రీతితో చెయ్యి, సమగ్రంగా చెయ్యి, పూర్ణంగా చెయ్యి. ఆత్మలాభం పొందటానికి ధైర్యం ఉండాలి. ఆత్మవిశ్వాసము ఉండాలి. ధైర్యంలేనివాడు ఏమీచేయలేడు.

శరీరం పోయేరోజున భగవాన్‌తో అక్కడ ఉన్నవారు మీరు వెళ్ళిపోతున్నారు. మేము ఉండిపోతున్నాము అన్నారు. నేను వెళ్ళిపోతున్నాను అంటున్నారు. వెళ్ళిపోవటానికి నాకు చోటు ఎక్కడ ఉంది అన్నారు భగవాన్. ఆయన ఎవడు అంటే ఆత్మ. ఆత్మ అంతటాఉంది. ఎక్కడికి వెళతాడు. అంతటా ఉన్నవస్తువుకు వెళ్ళటం ఏమిటి, రావటం ఏమిటి? రావటం, పోవటం ఇవి అన్ని జీవలక్షణాలు.

ఇంగ్లండు దేశస్థుడు ఒకరు దేశంకాని దేశం వచ్చాము, బంధువులను విడిచి పెట్టి వచ్చాము. ఇప్పుడు మీరు మమ్మలను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నారు అని రమణాచార్యులతో అన్నారు. పూర్వజన్మలలో ఏమీ సంబంధము లేకుండానే మనం ఇక్కడ కలుసుకొన్నామా? ఈసంబంధము మనలను మరోకచోట కలపదా అన్నారు భగవాన్. వాడికి బ్రహ్మానుభవం కలిగేవరకూ గురువు ఏదో ఒకరూపం ధరించి వస్తూ ఉంటాడు.

నీహృదయంలో ఒక సత్య వస్తువు ఉంది. దానితో నిరంతరము కలసిఉండు. అదే సత్సంగము. నీహృదయంలో ఉన్న సత్యవస్తువుతో కలిసి ఉండలేకపోతే బాహ్యంగా ఉన్న సత్పురుషులతో సహవాసం చెయ్యి. సత్పురుషులతో సహవాసంవలన సద్బుద్ధి కలుగుతుంది, సహృదయం కలుగుతుంది, విషయాన్ని అర్ధం చేసుకొనే బుద్ధి నీకు కులుగుతుంది. మీరుఎన్ని మాటలు విన్నా ఆమాటలు మీకు అర్ధమయితే మీకు సొంతం అవుతాయి. అర్ధంకాకపోతే సొంతంకావు. ఎంతవిన్నాము అనికాదు, ఎంతఅర్ధమయ్యింది అనేది ముఖ్యము.

నీవు లోకమునకు అత్యంత ఉపకారం చేయాలంటే జ్ఞానమును సంపాదించు. జ్ఞానమును సంపాదిస్తే నీద్వారా లోకమునకు ఉపకారము జరుగుతుంది. నీవు అనుకోనక్కరలేదు. ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో వాడు అనుకోడు వాడిద్వారా పని జరుగుతుంది. వాడి ద్వారాలోకము ఉద్ధరించబడుతుంది. ఉప్పులేని పప్పు ఎలా ఉంటుందో జ్ఞానులు లేని సమాజము అలా ఉంటుంది అని క్రీస్తు చెప్పాడు.

ఈశ్వరుడి మీద భక్తి ఉండాలి, ప్రేమ ఉండాలి. కారణం కనబడకూడదు. ఈశ్వరుడి మీద అకారణమైన భక్తి, అకారణమైన ప్రేమ ఎప్పుడైతే కలిగిందో ఈశ్వరుడు అంటే జ్ఞానం లేకుండా లేడు కాబట్టి ఆయన మనలను జ్ఞానంతో అలంకరిస్తాడు. ఈజన్మలోనే ఇప్పుడే జ్ఞానంతో అలంకరిస్తాడు.